
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 : కనిష్ఠం 24.6
ఆంధ్రజ్యోతి
కామారెడ్డి జిల్లా వార్తలు
గురువారం 26 సెప్టెంబరు 2024



ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 25: జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యపోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిన పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి తెలిపారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, దోమకొండ, మద్నూర్ ఆసుపత్రుల్లో గైనకాలజీ(7), అనేస్తిషియా(3), జనరల్ సర్జన్(4), పిడియాట్రిక్(5), ఆర్థోపెడిక్(1), జనరల్ జీడీఎంఓ(7), జనరల్ మెడిసిన్(2) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు అక్టోబరు 1న సంబంధిత సర్టిఫికెట్‌లతో దరఖాస్తులను కామారెడ్డిలోని డీసీహెచ్ఎస్ జిల్లా కార్యాలయంలో అందించాలని తెలిపారు.



ముందుకు సాగని మిల్లింగ్

- నత్తనడకన సీఎంఆర్ బియ్యం సేకరణ
- కస్టం మిల్లింగ్ రైస్‌ను సకాలంలో అందించని మిల్లర్లు
- డిఫాల్ట్ రైస్‌మిల్లర్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మూడు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే
- జిల్లాలో 136 రా.. మరో 35 బాయిల్డ్ రైస్‌మిల్లులు

కామారెడ్డి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వడంలో ముందుకు సాగడం లేదు. సీఎంఆర్ విధించిన గడువు ఈనెల చివరికల్లా ముగియనుంది. కానీ జిల్లాలో ఇంకా చాలా మిల్లులు నిర్దేశించిన లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీఎంఆర్ రైస్‌పై సంబంధిత శాఖాధికారులతో పాటు రైస్‌మిల్లర్లతో సమావేశం అయ్యారు. గడువులోగా సీఎంఆర్ రైస్ ఇవ్వని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా సీఎంఆర్ రైస్ సకాలంలో ఇవ్వని మిల్లులకు నోటీసులు జారీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ సిద్ధమవుతోంది. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ బియ్యం అప్పగించాల్సిందేనని ఇక గడువు ఇచ్చేదే లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే పలుమార్లు గడువు ఇచ్చామని అయినప్పటికీ కొన్ని మిల్లుల యాజమాన్యాలు పెద్ద ఎత్తున బియ్యం బకాయి పడ్డాయి. ఇలా జిల్లాలో సీఎంఆర్ రైస్ మిల్లుల నుంచి సేకరించడంలో అధికారులు సీరియస్ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ కేటాయించడంలో మిల్లర్లు సైతం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు గోదాంలు ఖాళీ లేకపోవడంతో సీఎంఆర్ ఇవ్వడం లేదనే పలు సాకులు చెబుతున్నారు.

జిల్లాలో 179 రైస్‌మిల్లులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 179 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైస్‌మిల్లులు ఉండగా మరో 35కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 578 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీ నెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.53లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీ నెల 5,462 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్‌బియ్యం పంపిణీకి ప్రతి ఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించే ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేస్తుంటారు.

మిల్లుల్లోనే సీఎంఆర్

జిల్లాలో మూడు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. 2022-23 వానాకాలం సీజన్‌లో 1.70లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా 22వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. 1.48లక్షల మెట్రిక్ టన్నులు మిల్లర్లు బకాయిలో ఉన్నట్లు సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు. 2023-24 వానాకాలం సీజన్‌లో 2.98లక్షల మెట్రిక్ టన్నుల రైస్ ఇవ్వాల్సి ఉండగా 98 వేల మెట్రిక్ టన్నులు రైస్ ఇచ్చారు. ఇంకా 2లక్షల మెట్రిక్ టన్నుల బకాయిలు ఉన్నారు. 2023-24 యాసంగి సీజన్‌లో 2.19లక్షల మెట్రిక్ టన్నుల రైస్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా 45 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. 1.74 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు బకాయిలో ఉన్నట్లు పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

గడువు ఇచ్చేదే లేదంటున్న అధికారులు

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. ఈనెల చివరి వరకు ఇవ్వాలని ప్రభుత్వం మిల్లర్లకు గడువు ఇచ్చింది. అయితే ఈ గడువు లోపు మిల్లర్ల నుంచి ఇంకా సీఎంఆర్ బియ్యం అందిస్తారో లేదో చూడాలి. సకాలంలో రైస్‌ను అందించని పలు రైస్‌మిల్లు యాజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే గడువు ముగిసిన బియ్యం ఇవ్వని మిల్లులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. వానాకాలం సీజన్‌దే కాకుండా యాసంగి సీజన్‌కు సంబంధించి రైస్ కూడా పూర్తిస్థాయిలో మిల్లర్ల నుంచి రాలేదు. అయితే సెప్టెంబరు చివరికల్లా వానాకాలం సీజన్‌లకు సంబంధించి గడువు ముగియనుంది. ఈ సీజన్‌ల బియ్యం కేటాయింపులో ఇక గడువు ఇచ్చేదేలేదని అధికారులు తేల్చి చెబుతున్నారు.

డిఫాల్ట్‌లో మిల్లర్లపై ఒత్తిడి

సీఎంఆర్ రైస్ సకాలంలో ఇవ్వకపోవడంతో డిఫాల్ట్‌లో ఉన్న రైస్‌మిల్లర్లపై అధికారులు ఒత్తిడి పెడుతున్నారు. ఈనెల 27లోగా ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి బదులు నగదు లేదా బియ్యం రూపంలో చెల్లించాలని అధికారులు ఆదేశించారు. 2021-22, 2022-23 వానాకాలం డిఫాల్ట్ రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ పెండింగ్ బకాయిలపై అధికారులు సమీక్షించి ఆయా మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. డిఫాల్ట్ అయిన మిల్లర్లు ఈనెల 27లోగా రైస్ ఇవ్వని యెడల వడ్డీతో నగదు చెల్లించాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించడంలో డిఫాల్ట్ రైస్‌మిల్లర్లు విఫలమయితే ఆర్ఆర్ చట్టం ప్రయోగిస్తామని రైస్‌మిల్లర్లకు హెచ్చరిస్తున్నారు.



పక్కపక్కనే..
రెండు పంచాయతీ కార్యాలయాలు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 25: ఒకే గ్రామంలో ఒకే చోట పక్క పక్కనే రెండు గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలు ఉండటం చాలా అరుదు. కానీ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో మాత్రం నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట్ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలు పక్క పక్కనే ఉండటం అందరిని ఆశ్చర్యపరుస్తోంది. నాగిరెడ్డిపేట మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట్, బంజారా తండా గ్రామాలు ఉండేవి. నాగిరెడ్డిపేట మండల కేంద్రం ఏర్పాటు సమయంలో మండలానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రధాన రహదారిపై ఉన్న గోపాల్‌పేట్ గ్రామంలో ఏర్పాటు చేశారు. దీంతో నాగిరెడ్డిపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సైతం గోపాల్‌పేట్ గ్రామంలోనే ఏర్పాటు చేశారు. 2018లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం లో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, అప్పటి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గోపాల్‌పేట్, బం జారా తండా గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయించారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైన గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీకి సొంత భవనం లేక పోవడంతో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షల రూపాయలను మంజూరు చేశారు. దీంతో గోపాల్‌పేట్ గ్రామంలో కొనసాగు తున్న నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ప్రభుత్వ ఖాళీ స్థలం ఉండటంతో ఈ స్థలంలో గోపాల్‌పేట్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ వంజరి సునీత గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. ఈ నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి జనవరి 4, 2024న ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రారంభించారు. దీంతో రెండు గ్రామాల గ్రామ పంచాయతీల కార్యాలయ భవనాలు పక్క పక్కనే ఉండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రెండు గ్రామాల ప్రజలు తమతమ పనుల నిమిత్తం పక్క పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తున్నారు.



పక్క పక్కనే ఉన్న నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు

అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 25: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ, పారిశుధ్యం ఇంటి పన్నుల వసూళ్లు, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ వాయిదాల చెల్లింపులు, లే అవుట్స్, భవన నిర్మాణాల అనుమతులు, ఉపాధిహామీ, ప్రజాపాలన, వన మహోత్సవం, మహిళ శక్తి, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్వహణ, ఫాంపాండ్స్, అమ్మ ఆదర్శ పాఠశాల తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభ్యుదయానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలను నిర్ణీత సమయంలో ప్రచురించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు నిరంతరం చేపట్టాలని, ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులు చేసి విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు కలిగిన వారికి వంద రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల కింద వ్యవసాయ అనుబంధ పనులు చేసుకోవచ్చని తెలిపారు. డ్రైడే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. గ్రామాల్లో ఆస్తిపన్ను, సీసీ చార్జీల వసూలు లక్ష్యం కనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. మహిళ శక్తి పథకంను ఎంపీడీవోలు మానటరింగి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వదంతులు సృష్టిస్తే..
కఠిన చర్యలు!

- చిన్నారి ప్రస్తుతం సురక్షితంగా ఉంది..
- నిందితుడిపై పోక్సో కేసు
- పాఠశాల వద్ద ఆస్తులు ధ్వంసం, పోలీసులకు గాయాలయ్యేలా చేసిన వారిపై కేసులు
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం
- ఎస్పీ సింధూశర్మ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 23న 6 సంవత్సరాల చిన్నారిపై జీవదాన్ పాఠశాలకు చెందిన ఓ పీఈటీ అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదు రావడంతో పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. బుధవారం కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు విచారణాధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిణి నియమించి విచారణ చేపట్టామని తెలిపారు. అన్నిఆ ధారాలు సేకరించి చార్జ్‌షీట్ ఫైల్ చేయడంతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసేలా చూడడంతో పాటు నిందితునికి కఠిన శిక్షపడేలా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం చిన్నారి సురక్షితంగా ఉందని సోషల్ మీడియాలో రూమార్స్ పోస్టింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటికే ఇష్టారీతిన పోస్టింగ్‌లు చేస్తూ అసత్యాలను ప్రచారం చేస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామని ప్రజలు ఎవరు వదంతులు నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు సర్క్యులేట్ చేయవద్దని తెలిపారు. అదేవిధంగా జీవదాన్ పాఠశాల వద్ద ఇష్టారీతిన వ్యవహరించి పాఠశాల ఆస్తుల ధ్వంసంతో పాటు పోలీసులకు గాయాలయ్యేలా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. పట్టణ సీఐతో పాటు ఎస్, ఏఆర్ఎస్, మరో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయని వారు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు : ఎస్పీ

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నేరస్తుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానాను న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. 2023లో కామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మరిపల్లి బాలకృష్ణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఇంటి బయట ఆడుకుంటుండగా చాక్‌లెట్స్, బిస్కెట్స్ కొనిస్తానని చెప్పి టీవీఎస్ ఎక్సెల్‌పై ఊరుబయట నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు తెలిపారు. రాత్రిపూట ఆ బాలికను గ్రామ శివాలయం వద్ద వదిలి వెళ్లిపోయాడని బాలికకు కోసం వెతుకుతున్న ఆమె తండ్రికి అపస్మారక స్థితిలో ఉన్న బాలిక కనిపించడంతో వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించగా జరిగిన విషయాన్ని తండ్రికి బాలిక వివరించిందని తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి కోర్టులో బాలకృష్ణను హాజరుపరచగా విచారణ చేపట్టిన న్యాయమూర్తి బుధవారం బాలకృష్ణకు జీవితఖైదు విధించారని తెలిపారు. అదేవిధంగా న్యాయసేవ సంస్థ ద్వారా రూ.7లక్షలను బాలిక భవిష్యత్ అవసరాల నిమిత్తం వినియోగించేందుకు అందించాలని సూచించారని తెలిపారు.



కేజీబీవీలో నీటి సమస్యను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నీటి సమస్యను పరిష్కరించాలి

- పిట్లంలో ఆసుపత్రి, పాఠశాలల తనిఖీలు
- కేజీబీవీలో నీటి సమస్య పరిశీలన
- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, ఆగస్టు 25: బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం పిట్లంలో సుడిగాలి పర్యటన చేశారు. మొదట కేజీబీవీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ నెలకొన్న నీటి సమస్య గురించి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఎందుకు తలెత్తిందని పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరాలు అడుగగా భూగర్భ జలాలు తగ్గి పోవడంతో బోరులో నీరు లేక సమస్య తలెత్తిందని తెలిపారు. తక్షణమే నీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సమస్య ఉందని పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి వివరించగా, సమస్యలను తీరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆసుపత్రిలో ఉన్న వృద్ధురాలు వాలిబాయి తనకు ఎలాంటి ఆధారం లేదని కనీసం పింఛన్ అయినా ఇప్పించండి అని మొర పెట్టుకుంది. స్పందించిన సబ్ కలెక్టర్ వృద్ధురాలికి పింఛన్ ఇప్పించాలని ఎంపీడీవో కమలాకర్‌ను ఆదేశించింది. ఆ తర్వాత జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, భవిత సెంటర్, మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలను పరిశీలించారు. జ్యోతిబాపూలే విద్యాలయంలో విద్యార్థినుల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ విద్యార్థిని చేరుకోవాలన్నారు. విద్యాలయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. విద్యార్థినులు పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించింది. విద్యాలయంలో వంట గదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత పాటించకపోతే విద్యార్థినులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆమె పేర్కొంది. మరోసారి తనిఖీకి వచ్చినప్పుడు సానిటేషన్ సక్రమంగా ఉండాలని ప్రిన్సిపాల్ గులాం రబ్బానికి ఆదేశించింది. ఆమె వెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో యాదగిరి, ఆర్ఐ శీతల్, కార్యదర్శి యాదగిరి, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో సానిటేషన్ నిర్వహణ ఓ ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కార్మికులను నియమించుకున్నారని గత రెండేళ్లుగా చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని సెలవులు కూడా ఇవ్వడం లేదని కావున వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అలకనంద, నవనీత, లక్ష్మి, పద్మ, రమా, హేమా, సవిత, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ వార్షిక సమావేశంలో మానాల

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: ఢిల్లీలో బుధవారం జరిగిన నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ వార్షిక మహాజన సభలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దిలీప్ సంగానే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మానాల సహకార సంఘాల్లో పెరిగిపోతున్న నిరాశ నిర్లక్ష్యం అదే విధంగా సహకార సంఘాలకు సభ్యులకు మధ్య ఉన్న భారీ అగాదాన్ని పూడ్చే విధంగా ప్రజలు, రైతులు సహకార సంఘం అంటే మాది అనే అనుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత జాతీయ సంఘానికి ఉందని దానికి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్‌లు సహకరించినప్పుడే సహకార యూనియన్‌ల మనుగడ సాగుతుందని ఆయన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు తెలుపుతుందని సహకార సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సహకార సంఘాలను బలోపేతం చేసేలా మరో జాతీయ ఉద్యమాన్ని తీసుకురావాల్సిన అవశ్యకతను ఆయన వివరించారు.

పాఠశాల స్థాయిలోనే వైకల్యాలను గుర్తించాలి

పెర్కిట్, సెప్టెంబరు 25: ప్రతీ విద్యార్థి వివరాలు ప్రశస్త యాప్‌లో పొందుపర్చి పాఠశాల స్థాయిలోనే వైకల్యాలను గుర్తించాలని జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్, సీఎంవో పడకంటి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఎంఈవో రాజగంగారాం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను పరిశీలిస్తూ ఉండాలని, ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయా తరగతి ఉపాధ్యాయుల బాధ్యత ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రశస్త యాప్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో గుర్తించిన వైకల్యాలను మదింపు చేయడానికి సమగ్రశిక్ష, ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈ యాప్‌ను రూపొందించామని, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ప్రతీ విద్యార్థిని పరిశీలించి రిపోర్టు యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. యాప్ ఫెస్ వన్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రిజిష్టర్ చేసుకునే విధానాన్ని స్పెషల్ టీచర్ రామకృష్ణ, ఐఈఆర్‌పీలు సునీల్, కిషన్, సురేష్‌లు వివరించారు. ఫెజ్- 2లో దివ్యంగులను నిర్ధారిస్తారని తెలిపారు. విద్యహక్కు చట్టం ప్రకారం గుర్తించిన 21 వైకల్యాలను పాఠశాల స్థాయిలోని గుర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్, ఆలూర్ మండలాల ప్రధానోపాధ్యాయులు, ఆలూర్ ఎంఈవో నరేందర్, పెర్కిట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఆర్మూర్, ఆలూర్ పాఠశాలల సీఆర్‌పీలు సంతోష్, లతలు పాల్గొన్నారు.

'క్రీడల్లో గెలుపోటములు సహజం'

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 25: క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని డిచ్‌పల్లి సీఐ మల్లేష్ అన్నారు. జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడల ముగింపు కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ మల్లేష్ మాటాడుతూ విద్యార్థులకు క్రీడలతో పాటు చదువు ఎంతో ముఖ్యమని, విద్యా రంగంలో భవిష్యత్‌లో మంచిగా చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబల్, ఇతర క్రీడల్లో గెలుపొందిన పాఠశాలల జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, స్థానిక ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఎస్సై సీహెచ్.తిరుపతి, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీసర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, జక్కం బాలకిషన్, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కుమ్మరి శీను, దాతలు, ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ కాల్వ మరమ్మతులు చేయాలని వినతి

డొంకేశ్వర్, సెప్టెంబరు 25: డొంకేశ్వర్ లిఫ్ట్ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని బుధవారం డొంకేశ్వర్ లిఫ్ట్ కమిటీ సభ్యులు కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాలువను ప్రతీ సంవత్సరం పూడికతీత తీసేందుకు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి నట్లయితే రైతులకు అదనపు భారం పడకుండా ఉంటుందని తెలిపారు. సాను కూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, లిఫ్ట్ చైర్మన్ నర్సారెడ్డి, డైరెక్టర్‌లు బార్ల చిన్న గంగారెడ్డి, నాయకుడు లింగన్న, కనకాపురం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినులకు దంత పరీక్షలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో బుధవారం విద్యారినులకు వైద్యులు దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 650మంది విద్యార్థినులకు డాక్టర్‌లు బారడ్ నవీన్, నిఖిత, సౌమ్యలు వైద్యపరీక్షలు నిర్వహించి లయన్స్ క్లబ్ వారు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు చెన్న రవికుమార్, గుర్రం విజయానంద్, శశిధర్‌రెడ్డి, అంబల్ల తిరుపతి, శ్రీధర్, పాఠశాల హెచ్ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్‌లు నీహర్, సాయిదీప్‌లు 150మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మం దులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, కార్యదర్శి దాచేపల్లి సంతోష్, అశోక్, నసీరోద్దిన్, గోపికృష్ణ, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అభినందన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ పరిధిలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో పథకాలు సాధించగా వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల నిర్వహించిన అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడాపోటీల్లో మార్చ్‌ఫస్ట్ బాలికల విభాగంలో ద్వితీయస్థానం, కబడ్డీ జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం, ఖోఖో జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం, అలాగే అథ్లెటిక్స్ పోటీల్లో 100మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీల్లో ఆరు పథకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం కేజీబీవీ పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయురాలు వీణను పాఠశాల ఇన్‌చార్జీ స్పెషల్ ఆఫీసర్ నవనీత అభినందించారు.

విద్యుత్ అధికారులకు ఘన సన్మానం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ అధికారులను ఘనంగా సన్మానించారు. ఇటీవల బదిలీపై వెళ్ళిన అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, నూతన అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ మోహన్‌లను విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు పట్టుశాలువ, మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో జేఏవోలు సంజీవ్, పోశెట్టి, ప్రకాష్, హరిష్, సూపర్‌వైజర్ శ్రావణ్, కార్మికులు గంగాధర్, రఫీ, యుసుఫ్, శేఖర్, అజయ్, రాజశేఖర్, వాజిద్, హీనయత్, రేవంత్, సాయి, సోను, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: శిశువులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గిరిబాబు అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శిశువుకు వ్యాధి నిరోధక టీకాలు అందే విధంగా ముందస్తు జాబితాను సిద్ధం చేసుకొని ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిం చాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు సూచిం చారు. కేంద్రంలో స్టాక్ రిజిస్ట్రర్, రికార్డులను పరిశీలించారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

మెండోర, సెప్టెంబరు25: నూతన ఎంఈవోగా దేగాం శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేగాం శ్రీనివాస్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించడంతో పీఆర్‌టీయు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.పీఆర్‌టీయు నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల నూతన విద్యాశాఖ అధికారిణిగా టి.రేణుక బాధ్యతలు చేపట్టారు. బుధవారం వేల్పూర్ ఎంఆర్‌సీ భవనంలో పీఆర్‌టీయూ నాయకులు స్వాగత సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత ఎంఈవోగా కొనసాగిన వనజారెడ్డిని, నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్న రేణుకలను శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు.

మోర్తాడ్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మోర్తాడ్ మండల నూతన విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం సమ్మిరెడ్డి తిమ్మాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. నోడల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యత కూడా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి అందరు ఎంఎన్‌వోలను ఎఫ్ఏసీ ఎంఈవోగా నియామించడం జరిగిందని తెలిపారు. బుధవారం మోర్తాడ్ మండల విద్యాధికారిగా సమ్మిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 25: మండలంలోని మునిపల్లి గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వేస్లీ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బుధవారం మండలంలోని మునిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం కంపోస్టు షెడ్డును స్థానిక అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. కంపోస్టు షెడ్డు వాడకంపై, గ్రామంలో జీపీ అనుమతులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీఈవో సతీష్‌కుమార్, ఎంఈవో యుసుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి, అధికారులు ఉన్నారు.

'యువత బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: యువత బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 91, 92 పోలింగ్‌బూత్‌లలో ఇంటింటికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు.

'వర్నిలో మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించాలి'

వర్ని(రూ)సెప్టెంబ్రూరు 25: వర్ని మండల కేంద్రలో మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి పేద విద్యార్థులకు విద్యనందించాలని సీపీఎం వర్ని శాఖ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్నిలో మహాసభ సందర్భంగా పార్టీ నాయకురాలు గాయత్రి పార్టీ జెండా ఆవిష్కరించారు. మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలపై సమీక్ష చేశారు. వర్నిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

రుద్రూరు, సెప్టెంబరు 25 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులుగా నియమితులైన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం రుద్రూరు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రుద్రూరు మండలానికి ముగ్గురు ఏఎంసీ డైరెక్టర్లను ఇచ్చి న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, చిక్కడపల్లి గ్రామ అధ్యక్షులు దువ్వ రవికుమార్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన అదనపు కలెక్టర్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: రానున్న గ్రామపంచాయతీ పాలక వర్గం ఎన్నికల దష్యా మండలంలోని కమ్మర్‌పల్లి, ఉప్లూ ర్ గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం సందర్శించి పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలశాలలోని పోలింగ్ కేంద్రాల తరగత గుదులను ఆయన సరిశీలించారు. విద్యుత్తు తదితర సమస్యలుంటే సరిచేయించాలని అదేశించారు. అనంతరం మండలంలోని ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేం ద్రాలనుఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ ఎం అంజనేయులు, ఎంపీడీవో రాజా శ్రీని వాస్, ఆర్ఐలు సతీష్, గంగారాం, ఈజీ ఎస్ టీఏలు, కార్యదర్శి శాంతి కుమార్, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ గౌడ్, మండల పరిషత్ కార్యాలయసిబ్బంది ఉన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నేడు కమ్మర్‌పల్లిలో అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో నేటినుంచి మూడురోజుల పాటు మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య, క్రీడల కన్వీనర్ పసుపుల సాయన్న, వ్యాయమ ఉపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు ఉదయం 10 గంటలకు అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్ ఉంటుందన్నారు. మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో మండలకేంద్రంలోని మినీస్టేడియానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినీస్టేడియంలో మూడురోజులపాటు జరుగనున్న మండలస్థాయి క్రీడోత్సవాల తొలిరోజు గురువారం ప్రారంభోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరు వుతు న్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మాజీ ఎంపీ టీసీ మైలారం సుధాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మినీ స్టేడియంకు చేరుకుని మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాలను ప్రారంభించి క్రీడాకారులు గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు. కాగా మండల క్రీడోత్సవాలకు సిద్ధమవుతున్న ఆయా పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో తర్ఫీదు పొంది సద్దమయ్యారు, కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు దాత దయానంద్ బుధవారం అందజేసిన క్రీడా దుస్తులతో మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్ చేశారు.


మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్ చేస్తున్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

యాప్‌లో దివ్యాంగ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

● ఎంఈవో ఎన్ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: దివ్యాంగ విద్యార్థులను గుర్తించే నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశస్త్ పేర ఒక యాప్‌ను రూపొందించిందని, ఈ యాప్‌ద్వారా మండలంలోని ప్రతీ పాఠశాలలో అంగవైకల్యం గల విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని మండల విద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఐఈఆర్‌పీ రాజు ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లిబిడ్డలకు ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి

రెంజల్, సెప్టెంబరు 25: ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింత మహిళలకు పౌష్టికాహారంతో తల్లిబిడ్డలకు ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి అన్నారు. బుధవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో పోషణ మాసం వారోత్సవాలలో భాగంగా గర్భిణీ, బాలింత మహిళలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పోషణ మహోత్సవంలో భాగంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

రుద్రూరు : గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో జానకమ్మ పేర్కొన్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలోని సులేమాన్‌నగర్‌లో నిర్వహించిన పోషణ్ అభియాన్ (పోషణమాసం) కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పోషకాహార లోపాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనత, జనన, బరువు తగ్గుదల తదితర ఆరోగ్యసమస్యలు ఏర్పడుతాయన్నారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలను తీసుకోవాలన్నారు. పోషకాహార లోపాలను అధిగమించడానికి అంగన్‌వాడీ వర్కర్లు మహిళలలో అవ గాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ బీసీ కోఆర్డినేటర్ నరేష్, బోధన్ సూపర్స్ ఆసియా బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, గోపి, లక్ష్మీ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఐకేపీ సీఏలుతదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌కు పురస్కారం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: ఆర్మూర్ ఐసీడీఎస్ పరిధిలోని ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో అంగన్‌వాడి టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గోలికరుణజ్యోతి ఉత్తమ అంగన్‌వాడి టీచర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన పోషణ అభియాన్, పోషణ మాసంలో పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం ఉత్తమ అంగన్‌వాడి టీచర్‌గా గుర్తించింది. బుధవారం నిజామాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రసూల్‌బీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: ప్రతీ సొసైటీలో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సైన్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని పెర్కిట్, గోవింద్‌పేట్, పిపి గ్రామాల సొసైటీలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఎరువులను గోదాంలో పీవోఎస్ మిషన్‌లో ఉన్న విధంగా ఎరువుల బస్తాలను జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. పీవోఎస్ మిషన్‌లో రైతుల ఆధార్‌నెంబర్ ఎంట్రీ చేసిన తర్వాతనే ఎరువులను విక్రయించాలని అన్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎరువులను సకాలంలో తెప్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, సొసైటీ చైర్మన్‌లు బోజారెడ్డి, మహిపాల్, హేమంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ముప్కాల్ : రైతులు మేలైన యాజమాన్య పద్దతులు పాటించడం వల్ల పంట దిగుబడులను సాధింవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సైన్ తెలిపారు. బుధవారం బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ప్రతీరోజు విధిగా పరిశీలిస్తూ ఉండాలని, ప్రస్తుల నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో బ్యాక్టీరియ ఆకు అందు తెగులు, అగ్గితెగులు, సుడిదోమ ఉదృతి ఎక్కువగా అయినట్టు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కలిసి మండల వారీగా పంటలు పొలాలను పరిశీలించారు. ఆయా మండలాల్లో ఎక్కువ వస్తున్న చీడపీడల యాజమాన్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. ఆయనవ వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి నిహారిక, రైతులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో రేషన్ డీలర్లకు పరీక్ష

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: రేషన్ దుకాణాల నిర్వహణ నిమిత్తం అభ్యర్థుల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం బోధన్‌లో జరిగే పరీక్ష కేంద్రానికి సమయపాలన పాటించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణ కేంద్రం ఉంటుందన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అర గంట ముందు పరీక్ష కేంద్రానికి తరలిరావాలని సూచించారు. ఎవరికైన హాల్‌టికెట్ అందని పక్షంలో పరీక్షకేంద్రం వద్ద పొందవచ్చని అన్నారు. పరీక్ష కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సమాచారం అందించామన్నారు. బోధన్ డివిజన్‌లో 18చోట్ల రేషన్ దుకాణాల నిర్వహణ నిమిత్తం ఖాళీలను పూరించేందుకు ప్రభుత్వం ద్వారా నోటిఫికేషన్ విడుదల అయిందని ఆయన తెలిపారు. రేషన్ దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తుల స్వీకరణ సమయంలో 227మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 180దరఖాస్తులను అంగీకరించినట్లు ఆయన స్పష్టం చేశారు. 47దరఖాస్తుదారులు చేసుకున్న దరఖాస్తులలో వయసు తేడాతో పాటు నిబంధనలు ప్రకారం లేని ఇతర కారణాల వద్ద దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ కోసం నోడల్ అధికారిగా బోధన్ తహసీల్దార్ విఠల్‌ను నియమించినట్లు తెలిపారు. ఇన్విలేటర్‌లు కూడా పరీక్ష పూర్తయ్యేంత వరకు అక్కడే ఉంటారని ఆయన వివరించారు. పరీక్ష సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరు సహ్యాకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విఠల్‌తదితరులున్నారు.

రైతు భరోసా ఇవ్వాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబర్25: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు ఎకరానికి 15 వేల రూపాయల రైతు భరోసా హామీని ఇచ్చిందని వెంటనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదును జమ చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ బోధన్ డివిజన్ నాయకులు గుమ్ముల గంగాధర్ ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ కాని రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని, వృద్ధాప్య పింఛన్ 4 వేలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

సామాన్యులకే సౌకర్యాలు కరువు : ఎమ్మెల్యే పైడి రాకేష్

నందిపేట, సెప్టెంబరు25: ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో సామాన్యులకే సౌకర్యాలు కరువయ్యాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న ఎస్‌సీ, బీసీ హాస్టళ్లను అలాగే ప్రభుత్వ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పార భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌లను సందర్శించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తమ పిల్లలుగా భావించి సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రపం చంలో అత్యంత గౌరవం ఉన్నది ఉపాధ్యాయులకేనని, వారు సదుపాయాల కల్పన కోసం రూ.100 ఖర్చుపెట్టడంలో తప్పులేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలపై పోరాటం చేస్తానని, ప్రభుత్వంతో త్వరలోనే మాట్లాడి పాఠశా లలకు భవనాలు, మౌళిక సదుపాయాలు కల్పిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీనాయకులు, హస్టల్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

ఘనంగా దీన్‌దయాల్ జయంతి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: దేశం, ధర్మం కోసం పాటుపడిన మహనీయుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను అనుసరించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకొని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను, ఆదర్శలను ప్రధాని నరేంద్రమోదీ ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగానే 370ఆర్టికల్ రద్దు చేయడం, సబ్‌కా సత్ సబ్‌కా వికాస్ ఆలో చనతో ముందుకు వెళ్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఆకుల రాజు, పొల్కం వేణు, ఆకుల శ్రీనివాస్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు : దీన్‌దయాల్ ఉపాధ్యాయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదామని బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ పేర్కొన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాళ్ నాయకత్వం, సేవాభావం, పార్టీ కోసం చేసిన కృషిని కొనియాడారు. వారి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన రచించిన సిద్దాంతాలనే ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టత కొరకు పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

● డీఐఈవో రవికుమార్

కోట్యాగిరి, సెప్టెంబరు 25: ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవికుమార్ పేర్కొన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈవో తనిఖీ చేశారు. కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. ఎంసెట్ బోధించాలని అధ్యాపకులకు సూచించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాక్టీకల్స్ రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌తో ముగ్గురు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా, అధ్యాపకులు దత్తాత్రి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట, సెప్టెంబరు 25: మండలంలోని జన్నేపల్లిలో వల్లూరి సురేష్ బాబుకు చెందిన ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. సురేష్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 10న హైదరాబాద్‌కు వెళ్లారని బుధవారం పని మనిషి సుబ్బమ్మ ఇంటికి శుభ్రం చేయడానికి రాగా వెనుక తలుపు తాళం పగిలి ఉందన్నారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ యాజమానికి ఫోన్‌లో వివరించగా మధ్యాహ్నం వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటిని పరిశీలించారు. ఇంటి లోపల గుర్తుతెలియని దొంగలు బీరువాతో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేశారని, లోపల ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 36 తులాల వెండితో పాటు 30వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారని ఆయన పేర్కొన్నారు, సంఘటన స్థలాన్ని క్లూస్ టీమ్ సభ్యులు పరిశీలించి ఆధారాలను సేకరించడం జరిగిందని అన్నారు. సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రెంజల్(రూ)సెప్టెంబ్రూరు 25: మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ సాయన్న తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని మృతుడు చామన్‌చాయ అని, శరీరంపై ధరించిన టీషర్ట్‌పై శంకర్ ఇంజనీరింగ్ కేరాఫ్ నిజామాబాద్ అని రాసి ఉందని ఎవరికైనా వివరాలు తెలిస్తే రెంజల్ పోలీసులకు ఫోన్ నెంబర్ 8712659874 ఫోన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ సాయన్న కోరారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

రుద్రూరు, సెప్టెంబరు 25 : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం రుద్రూరు, అక్బర్‌నగర్, అంబం (ఆర్) గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు వైద్యాధికారిణి అయేషా సిద్దిఖీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో పనిచేసే కార్మికులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం గ్రామ పంచాయతీల కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో చేసే సేవలు మరువలేనివన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, గంగారాం, సూపర్‌వైజర్‌లు రవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది(ఎంపీడబ్ల్యూఎస్)కు వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ పరిధిలోని దంపింగ్‌యార్డులో బుధవారం కమిషనర్ రాజు మొక్కలను నాటారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సం రక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య దరఖాస్తుకు గడువు పెంపు

భీమ్‌గల్ సెప్టెంబరు 25: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య యందు 2024-25సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు పొందెందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ తెలిపారు. ఇంటర్మీడియేట్ పూర్తి అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఏలాంటి అపరాద రుసుము లేకుండా ఈనెల 30తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు పూర్తి సమాచారం కోసం 9948581970నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మాదిగ దండోరా నాయకులు

ఎడపల్లి, సెప్టెంబర్ 25: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలోగల మాదిగ దండోరా సంఘ సభ్యులు బుదవారం స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి మక్క చేనుల గురించి వినతిపత్రం అందించారు. అనంతరం వారు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ నాయకులు విజయ్ గౌడ్, మాదిగ దండోరా సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబర్25: 60సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ బుధవారం ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు ఎడపల్లి వీఆర్ఏల వారసులు బోధన్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు కరుణాకర్, మండలాల అధ్యక్షులు రత్నాకర్, శివ, అబ్బులు తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లిలో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కిరాణ్మాయికి వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏల వారసులకు జీవో నెంబర్ 81, 85ప్రకారం నియామక ఉత్తర్వులు ఇప్పించి వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాని తహసీల్దార్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తలారి లక్ష్మణ్, వీఆర్ఏలు మధు, శంకర్, చంద్రశేఖర్, నరేందర్, అనంత్‌రావు, రాములు, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులు సమన్వయంతో విధులు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను అందజేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విఠల్ రాజ్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటర్నేషనల్ ఫార్మాసిస్టు డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాసిస్టులు రోగులకు అవసరమైన మందులను సమన్వయంతో అందించాలన్నారు. వైద్యులు సూచించిన మందులను స్థానికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రామకృష్ణ, అభిలాష్, హరికృష్ణ, కిరణ్ రాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మినీస్టేడియానికి రూ.51వేల విరాళం

ముప్కాల్, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న ఇండోర్ స్టేడియం కోసం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి తనవంతు సహాయంగా రూ.51వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం నిర్వాహకులు బద్దం నర్సారెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు నునుగు అంజయ్య, డి.సాయన్న, మోతె గంగారెడ్డి, గంగారాం, సంజీవ్, ప్రవీణ్, నవీన్, దినేష్, హరిష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందడమే అంత్యోదయ లక్ష్యం

● ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25: చిట్ట చివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందడమే అంత్యోదయ లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాత్మ మనవతా వాదాన్ని ప్రవచించి అంత్యోదయ విధానాన్ని రూపొందించి చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందటమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారని, గ్రామీణాభివృద్ధి స్వావలంబన దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమని చాటిచెప్పిన వ్యక్తి, ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీకి పటిష్ట పునాదులు వేసిన వ్యక్తి దీన్‌దయాల్ అని అన్నారు. ఆయన చూపిన మార్గంలోని ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ముందుకు సాగుతుందని తెలిపారు. ఏ ప్రభుత్వ పథకం అయిన మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్దిదారుని ఖాతాకు చేరేలా డిజిటల్ విధానాన్ని అవలంభిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు రవీందర్ పాల్గొన్నారు.



దీన్‌దయాల్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తాడ్వాయి: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు హోటల్ శ్రీను, వెంకట్‌రావు, మండల ప్రధానకార్యదర్శి తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జగద్గురు పాదయాత్రలో జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్, సెప్టెంబరు 25 : అనంత శ్రీ విభూషిత జగద్గురు రామానంద శ్రీ స్వామి నరేంద్ర చార్య మహారాజ్ సంస్థాన్ అంతర్గతంగా గల జుక్కల్ మండలంలోని తెలంగాణ ఉప పీఠం నుంచి బుధవారం వసుంధర పాయ్ దిండి పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భక్తులతో పాటు పాల్గొని పల్లకి మోశారు. పాదయాత్రలో కొద్ది దూరం భక్తులతో నడిచారు. తెలంగాణ,మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిజీ పాదుకలను దర్శించుకుంటూ పాదయాత్ర ద్వారా సామిజీ సందేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ బయలుదేరారు. పాద యాత్ర ప్రస్థాన కార్యక్రమంలో భక్తులు ఉదయం నుంచే ఎంతో ఉత్సాహంగా పాల్గొని జగద్గురు నరేంద్రాచార్య మహారాజ్, స్వామీజీ సందేశాన్ని సంబంధించిన ఫ్లెక్సీల ద్వారా పాల్గొన్నారు. ఈ పాదయాత్ర తెలంగాణ ఉపపీఠం నుంచి మహారాష్ట్రలోని నాణిజ్ఞాం వరకు 26 రోజులు 650 కిలో మీటర్ల పాదయాత్ర జరగనుందని నిర్వాహకులు తెలిపారు.



జుక్కల్ నుంచి మహారాష్ట్రకు బయలుదేరిన పాదయాత్రలో పల్లకి మోసిన జుక్కల్ ఎమ్మెల్యే



ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

ప్రమాణ స్వీకారానికి రావాలని ఎంపీకి ఆహ్వానం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 25 : రేపు ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మారెడ్డి రజితారెడ్డి ప్రమాణ స్వీకారానికి బుధవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితా వెంకట్, రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈరీ ఫ్, మాజీ జడ్పీటీసీ సామెల్, మాజీ సొసైటీ చైర్మన్ బొండ్ల సాయిలు, మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, గంట సాయిలు, మాజీ ఎంపీటీసీ షేకేవత్ అలీ, భిక్కనూర్, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, పద్మారావు తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 25: జుక్కల్ మండలం కౌలాస్ ప్రాథమిక పాఠశాల నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు సతీష్ కుమార్, వినోదలను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యవర్ధన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏ ప్రాంతంలో పనిచేసిన కొన్నాళ్ల తర్వాత బదిలీ అనేది సాధారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శోభ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి

●ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 25 : ఇటీవల విడుదల చేసిన ఓటర్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్డీవో మన్నే ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత బీఎల్‌వో దృష్టికి తీసుకెళ్లాలని అదేవిధంగా ఎవరికైనా ఓటు హక్కు రెండు బూతులలో ఉంటే తమ దృష్టికి తీసుకురావలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ మహేందర్, నాయకులు తిరుపతి, బాలకిషన్, నర్సింలు, బిట్ల సురేందర్‌పాల్గొన్నారు.

'ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి'

భిక్కనూరు, సెప్టెంబరు 25: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అంతంపల్లి సింగిల్ విండో పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతీ రైతు ఖాతాలో జమ చేయాలని కోరారు.

అందుబాటులో ఉంటూ.. ప్రజల సమస్యలు వింటూ..

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 25: నిత్యం వివిధ పనులలో బిజీగా ఉండే ప్రజా ప్రతి నిధులు కాస్త విరామం దొరకగానే ప్రజల సమస్యలు తీర్చడంలో బిజీగా మారుతారు. ఇటీవల కొద్ది రోజులు అమెరికా పర్యటన చేసుకుని వచ్చిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు రెండు రోజుల నుంచి జుక్కల్ నియోజకవర్గంలో ఉంటూ పాలన అందించే దిశగా సాగుతున్నారు. మంగళవారం జుక్కల్ నియోజకవర్గంతో పాటు కామారెడ్డి జిల్లా కేంద్రంలో అధికారులతో వివిధ అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఉదయం నుంచే ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. దీంతో వివిధ పనులపై తన దగ్గరకు వచ్చిన వారి సమస్యలు వింటూ వాటిని పరిష్కరించారు. రెవెన్యూ, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో వివిధ పనులపై చర్చించారు.



క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సహకార బ్యాంక్ మేనేజర్లతో రివ్యూ..

ఈ సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని ఆయా మండలాల పరిధిలో గల సహకార సంఘ మేనేజర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీకి సంబంధించి సహకార బ్యాంకు మేనేజర్లు బ్యాంకుకు వచ్చే రైతులకు ఏం సమాచారం కావాలన్నా అందించాలని సూచించారు. దీంతో పాటుగానే రైతుల ఖాతాలలో, ఆధార్ కార్డులలో దొర్లిన తప్పులను సవరించి ప్రతీ ఒక్కరికి రుణ మాఫీ వర్తించే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం జుక్కల్ నియోజకవర్గం లోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయాగౌడ్, గంగునాయక్, రాజు పటేల్, ఉమాకాంత్ దేశాయ్, రమేష్ దేశాయ్, దేవిదాస్, సాయి కర్ణ జాదవ్, లక్ష్మణ్, గయక్వాడ్ విఠల్, దిలీప్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో నూతన ఎంఈవోలుగా బుధవారం పలువురు బాధ్యతలు చేపట్టారు.

నసురుల్లాబాద్, సెప్టెంబరు 25: మండల విద్యాశాఖ అధికారిగా నసురుల్లాబాద్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు చందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి చందర్, రమణ, విజయకుమార్, హన్మాండ్లు, మంద ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల విద్యాశాఖాధికారిగా వెంకన్న బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వెంకన్న సీనియర్ కావడంతో ఉన్నతాధికారులు ఆయనకు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. కొన్నాళ్ళుగా బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావు బీర్కూర్ మండల ఇంచార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా కొత్తగా ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంకన్నకు పీఆర్‌టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు.

పెద్దకొడప్‌గల్: మండల విద్యాధి కారి గా కాటేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు గాను మండలంలో నోడల్ అధికారులుగా పని చేస్తున్న వారికి పూర్తిస్థాయిలో ఎంఈవోగా బాధ్యతలు అప్పగించింది. ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను పీఆర్‌టీయూ శాఖ సన్మానించింది. అనంతరం విద్యాధి కారిగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో విద్యా వ్యవస్థ పటిష్టం కోసం కృషి చేస్తానని, మారుమూల ప్రాంతాలలో ఉన్న పాఠశాలల్లో కూడ నాణ్యతతో కూడిన విద్యను బోధించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, కిషోర్ సింగ్ పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన చందర్



భిక్కనూరు ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన రాజా గంగారెడ్డి

భిక్కనూరు: మండల విద్యా శాఖాధికారిగా రాజా గంగారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు తనతో సహకరించాలని, విద్య శాఖ అభివృద్ధికి ఉపాధ్యాయులందరిని కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. పీఆర్టీయూ నాయకులు ఎంఈవోను సన్మానించారు.

బిచ్కుంద: మండల విద్యాశాఖధికారిగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారాలతో విద్యాభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై దృష్టిసారిస్తానని తెలిపారు. పీఆర్‌టీయూ సభ్యులు ఎంఈవోకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఈర్షద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట : మండల ఎంఈవోగా జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలకు చెందిన సీనియర్ పీజీ హెచ్‌ఎంను నోడల్ అధికారిగా(ఎంఈవో) నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు రావడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేం దుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యాయులు సిద్దీఖీ ఉన్నారు.

దోమకొండ: మండల ఎంఈవోగా బుధవారం ఏఎస్ విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేలా చూస్తానన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు

గురుకుల విద్యార్థినుల ఎంపిక

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ పోటీలలో బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అండర్-14, అండర్-17 విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆయా విభాగాలలో 23 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పీడీలు ధర్మేందర్, మల్లేష్, సంజీవ్, రాజు, సంతోష్, సాయిలు, ప్రియాంక, ప్రసన్న, నిర్మ, పీఈటీలు అంబిక, లాల్‌సింగ్, రవి, జ్యోతి, రాజు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

దోమకొండ, సెప్టెంబరు 25: తెలంగాణలోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాన్ని నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం నూతనంగా నియామకమైన భిక్కనూరు మార్కెట్ కమిటి చైర్మన్ పాతరాజు ప్రభుత్వ సలహదారుడిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

దోమకొండ, సెప్టెంబరు 25: బీబీపేట గ్రామానికి చెందిన పెద్దరాములు అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి కిందపడడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన భార్య రజిత తల్లిగారింటికి వెళ్లేందుకు బీబీపేట నుంచి బయలుదేరి జనగామ మర్రిదాటిన తర్వాత బాయిల్డ్ రైస్‌మిల్ దగ్గరికి చేరగానే బైక్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పి కింద పడి చనిపోయాడని తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 45,46,47,31వ వార్డులో ఓ పిచ్చి కుక్క దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే వారు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సత్తెవ్వ అనే మహిళకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. వార్డులలో కుక్కల సంతతి పెరిగిందని స్థానిక కౌన్సిలర్‌లు పేర్కొంటున్నారు. అధికారులు వాటి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.



కుక్కదాడిలో గాయపడిన బాధితులు

కమ్మరి చెరువులో పడి ఒకరి మృతి

బిచ్కుంద, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని కమ్మరి చెరువులో పడి హన్మాండ్లు (38) అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. హన్మాండ్లు ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని బుధవారం కమ్మరి చెరువులో శవం నీటిపైకి తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పరిశీలించగా హన్మాండ్లుగా తేలిందని తెలిపారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

త్వరలో మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకాలు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 25: జుక్కల్ నియోజకవర్గ పరిధిలో గల పిట్లం, బిచ్కుంద, మద్నూర్ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను త్వరలోనే ఖరారు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు తెలిపారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గల మార్కెట్ కమిటీలకు త్వరలోనే పాలకవర్గాలను నియమిస్తామని తెలిపారు. వ్యవ సాయరంగానికి మార్కెట్ కమిటీలకు అవినాభావ సంబంధం ఉన్నందున త్వరలోనే ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని వేసి వారి ద్వారా సమర్థులైన చైర్మన్లను నియమిస్తామని తెలిపారు. ఆయా మండలాలలో ఈ చైర్మన్లపై జోరుగా వివిధ రకాల ఊహాగానాలు వస్తున్నాయని, వాటిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు. పిట్లం బీసీ జనరల్, బిచ్కుంద జనరల్ మహిళ, మద్నూర్ ఎస్సీ మహిళా రిజర్వేషన్లు ఉన్నందున కమిటీ ద్వారా సమర్థత కలిగిన వారిని గుర్తించి చైర్మన్లుగా నియమిస్తామని తెలిపారు. ఈ నియమాకాల్లో వస్తున్న పుకార్లను ఎవరూ నమ్మొద్దని తెలిపారు.

ఈదురు గాలుల వర్షానికి నేల రాలిన పంటలను పరిశీలించిన ఏవో

లింగంపేట, సెప్టెంబర్ 25 : మండలంలోని భవానిపేటలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి నేలరాలిన వరి పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ పరిశీలించారు. మండలంలోని భవానిపేట, పొల్కంపేట, కన్నాపూర్, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, జల్దిపల్లి గ్రామాలలో వరి పంటలు నేలపై పడ్డాయని పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

పంటల సాగులో సూచనలు పాటించాలి

భిక్కనూరు, సెప్టెంబరు 25: పంటల సాగులో రైతులు తమ సూచన లు పాటించాలని భిక్కనూరు వ్యవసాయాధికారిణి రాధ సూచించారు. బుధవారం భిక్కనూరులో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంటలలో చీడ పురుగులు, వరిలో కాండం తొలుచు పురుగును గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు వరి పిలకదశలో 4 జీ గులికలను, 8 కేజీలు ఎకరానికి వేసుకోవాలని, పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఫ్రిప్రొనిల్ రెండు ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గాంధారి, సెప్టెంబరు 25: గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరారం గ్రామంలోని సాయిరాం ఇంటికి చెక్కులను అందించారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, డీసీసీబీ జిల్లాడైరెక్టర్ సాయికుమార్,మండల అధ్యక్షుడు మోహన్, మాజీ సర్పంచ్ సంజీవ్, బాలయ్య, రవి పాల్గొన్నారు.

తాడ్వాయి: చందాపూర్,సంగోజీవాడి,బ్రహ్మాణపల్లి,కన్కల్ గ్రామాలకు చెందిన ప్రజలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీచేసినట్లు మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ జక్కుల రాజిరెడ్డి, మండల నాయకులు సుధాకర్‌రావు, నర్సారెడ్డి, రాజేందర్, గైని శివాజీ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీ చెక్కులు..

భిక్కనూరు, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం 75 మంది లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదిముబారాక్ చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఆయా శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలి

గాంధారి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో సోమవారం అఖిలపక్షం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు వరంగల్ డిక్లేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని, ఎకరాకు రూ.15వేలు రైతు పెట్టుబడి ఆర్థిక సహాయం అందిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందని రుణ మాఫీలో కొర్రీలు పెట్టిందన్నారు. ఈ నెల 30న అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ధర్నా రైతులతో పెద్దు ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, కొమ్ముల రమేష్, ముస్తాప, మల్లేష్‌యాదవ్, తూర్పు సంతోష్, సురేష్, శ్రీకాంత్, సాయిలు, యాదవ్ సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల ఫ్రెషర్స్ డే

సదాశివనగర్ , సెప్టెంబరు 25: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభరాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, శ్రావణిని కల్చరల్ కమిటీ కో-ఆర్డినేటర్, సింధూర పాల్గొన్నారు.



మర్కల్ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో విద్యార్థులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	ఏఆర్ఎమ్
ప్రియా 35	మత్తు వదలరా-2

బాన్సువాడ	
మహేశ్వరి	హైడ్ అండ్ సీక్
వెంకటేశ్వర	ఉత్సవం

చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190